## క్లుప్తంగా

### ఎంహెచ్‌పీఎస్ కన్వీనర్‌గా నాగేంద్ర



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: మాదిగ హక్కుల సంరక్షణ సమితి తాడిపత్రి కన్వీనర్‌గా వంగనూరుకు చెందిన నాగేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పట్టణంలోని ఎంహెచ్‌పీఎస్ కార్యాలయంలో సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకే రామతీర్థం, జిల్లా అధ్యక్షుడు నాగన్న ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక జరిగింది. ఈసందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ మాదిగల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. అనంతరం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నల్లప్ప, మనోహర్, చిన్నబాబు, నారాయణ, గంగాధర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

### మట్కా, పేకాటపై సమాచారం ఇవ్వండి

యల్లనూరు: మండలంలో ఎక్కడైనా మట్కా, పేకాట, గుట్కా, ఇసుక అక్రమ రవాణా వంటివి జరుగుతుంటే సమాచారం ఇవ్వాలని పుట్లూరు సీఐ సత్యబాబు ప్రజలను కోరారు. బుధవారం యల్లనూరు పోలీస్‌స్టేషన్‌ను సీఐ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాల కట్టడి విషయంలో పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారన్నారు. నిందితులు ఎంతటి వారైనా ఉపేక్షించబోయమని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మట్కా, పేకాటపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్‌ఐ శ్రీరాం ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

### రక్తదానంపై అపోహలు వీడాలి



మాట్లాడుతున్న హరిప్రసాద్

గుంతకల్లు: యువత రక్తదానం అపోహలు వీడాలని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక ఎంబీఏ అండ్ ఎంసీఏ కళాశాలలో జేవీవీ ఆధ్వర్యంలో రక్తదానంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చేసే రక్తదానం బాధితుల ప్రాణాలను నిలుపుతుందన్నారు. సామాజిక బాధ్యతగా తీసుకొని ప్రతి విద్యార్థి రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఓంకార్, జేవీవీ నాయకుడు వినోద్‌కుమార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి హామీ పనులపై సమీక్ష



మాట్లాడుతున్న ఏపీఓ షబ్బీర్‌బాషా

యల్లనూరు: మండలవ్యాప్తంగా చేపడుతున్న ఉపాధి పనులపై ఏపీఓ షబ్బీర్‌బాషా బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. హార్టికల్చర్, పశువుల షెడ్డు పనులను వంద శాతం పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద సాగు చేసిన పండ్ల మొక్కలు బతికేలా చూడాలన్నారు. గోకులం పథకం కింద పశువుల షెడ్ల పనులు వందశాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈసీ బబ్లు, టెక్నికల్ అసిస్టెంట్ ప్రతాప్, జయరాం, శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### కలెక్టరేట్ ధర్నా జయప్రదం చేయండి



మాట్లాడుతున్న మోహన్‌నాయక్

పామిడి: విద్యారంగంలోని సమస్యల పరిష్కారంపై గురువారం అనంతపురం కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బీ మోహన్‌నాయక్ విద్యార్థులను కోరారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద సుమారు రూ.3,400 కోట్లు పెండింగ్‌లో ఉండడం కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరికి నిలువెత్తు నిదర్శనమన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఫీజు డబ్బును విడుదల చేస్తానన్న హామీపై ఊసెత్తక పోవడం దారుణమన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను 1,3,5 సెమిస్టర్లకు పరీక్షలు ఫీజు చెల్లించాలంటూ ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

# క్షణక్షణం... భయం భయం!

- అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్‌గా ఎస్‌ఎన్‌పేట మోరీ
- మందుబాబులు, పేకాటరాయుళ్లకు ఆవాసంగా మారిన వైనం
- వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్న జనం



మందుబాబులకు అడ్డాగా మారిన ప్రాంతం ఇదే..

గుంతకల్లు: సత్యనారాయణపేట వాసులు క్షణక్షణం భయంభయంగా గడుపుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు సత్యనారాయణపేట(ఎస్‌ఎన్‌పేట) మోరీ ఏరియా అడ్డాగా మారడమే ఇందుకు కారణం. ఈ ప్రాంతంలో ముళ్ల పొదలు పెరిగిపోవడంతో మందుబాబులు, పేకాటరాయుళ్లు తమ ఆవాసంగా మార్చుకున్నారు. గుంతకల్లు–గుత్తి రైలు మార్గం గుండా వెళ్లడానికి పట్టణంలోని సత్యనారాయణపేట ఏరియాలో మోరీ నిర్మించారు. ఈ మోరీకి శివాలయం ఒక వైపు టూటౌన్ ఏరియా, మరో వైపు శ్మశాన వాటిక వెళ్లే దారి కసాపురం పోలీసుస్టేషన్ పరిధిలోకి, రైలు మార్గం రైల్వే జీఆర్‌పీ పరిధిలోకి వస్తాయి. టూటౌన్ పరిధిలోని పాత ఊరిలోని శివాలయం వద్ద ఉన్న పోతప్ప కట్ట సర్కిల్ వద్ద నుంచి రైలు మార్గంపై వెళ్లడానికి అస్కారం ఉండడంతో తాగుబోతులు, పేకాటరాయుళ్లకు అడ్డాగా మారిపోయింది. రాత్రి వేళల్లో వీరి అగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతాయన్నాయని స్థానికులు వాపోతున్నారు. మద్యం సీసాలు పగులగొట్టడం, ఇంటి ముందు పడేయడం వంటి చేష్టలతో విసిగెత్తిపోతున్నారు. కార్తీక మాసం కావడంతో పాతూరులోని శివాలయానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అయితే మద్యం మత్తులో ఉన్న మందుబాబులను చూసి భక్తులు భయాందోళన చెందుతున్నారు. పేకాటలో సొమ్ము పోగొట్టుకున్నా వారు, మద్యానికి డబ్బు తక్కువ రావడంతో ఇళ్ల ముందు ఉన్న చిన్న చిన్న సామాన్లు ఎత్తుకెళ్తున్నారని స్థానికులు వాపోతున్నారు. రెండు రోజుల క్రితం చిన్నారి అడుకునేందుకు ఇంటి ముందు ఉంచిన ఆట వస్తువులు సైతం ఎత్తుకెళ్లినట్లు చెబుతున్నారు.

**లోకోపైలెట్ల ఆందోళన..**

ముంబై–చైన్నె ప్రధాన రైలు మార్గంలోని గుంతకల్లు–గుత్తి రైలు మార్గం గుంతకల్లు జంక్షన్‌కు సమీపంలో ఉండడంతో ప్రతి ఎక్స్‌ప్రెస్ రైలు నెమ్మదిగా వస్తుంటాయి. వారం రోజుల క్రితం ఈ మోరీ సమీపంలో ఓ వ్యక్తి ట్రాక్‌పై పడి ఉన్న విషయాన్ని భువనేశ్వర్ వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ లోకోపైలెట్ గుర్తించి వెంటనే జీఆర్‌పీ పోలీసులకు సమాచారం చేరవేశాడు. దీంతో వారు అక్కడ చేరుకుని ట్రాక్‌పై ఉన్న వ్యక్తి మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించి పక్కకు తీసుకెళ్లారు. తర్వాత పోలీసులు విచారించగా అతడిని పట్టణానికి చెందిన అల్లావుద్దీన్‌గా గుర్తించారు. మందుబాబులే కాకుండా ఈ ప్రాంతంలోకి బహిర్భూమికి చాలా మంది వస్తుంటారు. దీంతో ఏ సమయంలో ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని లోకో పైలెట్లు ఆందోళన చెందుతున్నారు.

**సమన్వయ లోపం.. జనాలకు శాపం..**

పోలీసుల సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. శివాలయం వైపు టూటౌన్ పోలీసులు శ్మశాన వాటిక వెళ్లే రహదారి వైపు కసాపురం పోలీసులు, రైలు మార్గంపై జీఆర్‌పీ పోలీసులు గస్తీ నిర్వహించాలి. వీరి మధ్య సఖ్యత లేకపోవడంతో మందుబాబులు, పేకాటరాయుళ్లు ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైనట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు గస్తీని ముమ్మరం చేసి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టవేయాలని స్థానికులు కోరుతున్నారు.

**వస్తువులు ఎత్తుకెళ్తున్నారు**

పగలురాత్రి అన్న తేడా లేకుండా మందుబాబులు, పేకాటరాయుళ్లు చెలరేగిపోతున్నారు. డబ్బు చాలక చివరకు ఇంటి ముందు ఉంచి ఇనుప వస్తువులు ఎత్తుకెళుతున్నారు. మొన్న మా పాపను ఆడించి వీల్‌చైర్‌ను బయట ఉంచి పాపను తీసుకెళ్లాను. తర్వాత ఇంటిల్లోకి వెళ్లి బయటకు వచ్చి చూసే సరికి వీల్‌చైర్ కనపడలేదు. చాలా భయంగా ఉంది.

– రామాంజినమ్మ, పోతప్పకట్ట వీధి, గుంతకల్లు

**ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియడం లేదు**

మోరీ వద్ద ముళ్లపొదలు పెరిగి చిట్ట అడవిగా తయారైంది. మద్యం సేవించడానికి అనువుగా ఉండడంతో చాలా మంది ఇక్కడికి వస్తుంటారు. వీరు మత్తులో ఏవిధంగా ప్రవర్తిస్తారో వారికే తెలియదు. రాత్రి పూట గట్టిగా అరుపులు, కేకలు వేస్తుంటారు. ఇప్పటకైనా పోలీసులు స్పందించి మందుబాబులు, పేకాటరాయుళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– మాణిక్యం, సత్యనారాయణపేట

## ఉపాధి హామీ పనులపై గ్రామసభలు



నార్పలలో ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రం ఇస్తున్న కూలీలు



కొర్రపాడులో మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవనాయుడు

నార్పల: ఉపాధి హామీ పనులపై బుధవారం మండలవ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించారు. ఉపాధి హామీ కింద రైతుల పొలాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఈఓఆర్డీ శైలజారాణి తెలిపారు. నార్పలలో జరిగిన కార్యక్రమంలో ఏడాదికి 150 రోజులు పని దినాలను కల్పించాలని, రోజుకు రూ.600 కూలి పడేవిధంగా చూడాలని ఉపాధి కూలీలు జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మకు, అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమాల్లో సర్పంచు మన్నీల సుప్రియ,జెడ్పీ వైస్ చైర్మన్ నాగరత్నమ్మ,పంచాయతీ కార్యదర్శి శ్యామల,ఉప సర్పంచు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గ్రామసభలపై సమాచారం ముందుగా తెలియజేయకపోవడంతో ప్రజలు హాజరుకాలేదు. దీంతో అధికారులు గ్రామసభలను తూతూ మంత్రంగా ముగించారు.

గార్లదిన్నె: కల్లూరు, కమలాపురం, కేశవాపురం,కొప్పలకొండ, కోటంక, క్రిష్టా పురం,శిరివరం, పెనకచెర్లలో బుధవారం ఉపాధి హామీ పనులపై గ్రామ సభలు నిర్వ హించినట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి పేర్కొన్నారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం గార్లదిన్నె మండలంను కరువు మండలంగా గుర్తించిందన్నారు. మండలంలోని ప్రజలు పనులు లేక ఇతరప్రాంతాలకు వలసలు వెళ్లకుండా ఉపాధి హామీ కింద పనులు కల్పిస్తామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బుక్కరాయసముద్రం: ఉపాధి హామీ కింద విరివిగా పనులు కల్పించాలని ఆర్డీఓ కేశవ నాయుడు ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. బుధవారం మండల పరిధిలోని కొర్రపాడులో జరిగిన గ్రామ సభకు హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించాలన్నారు. గ్రామాల వారిగా నివేదికలు తయారు చేసి పంపాలన్నారు. ఈసందర్భంగా తాడిపత్రి రహదారి నిర్వాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ పుణ్యవతి, డీటీ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసుకోండి





రేకులకుంటలో సూచనలిస్తున్న ఏడీఏ రవి, గాండ్లపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు

బుక్కరాయసముద్రం: రైతులు గ్రామాల్లో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని అనంతపురం ఏడీఏ రవి సూచించారు. బుధవారం రేకులకుంట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసుకుంటే రైతులు పండించిన పంటలను తమ సంఘం బ్రాండ్ పేరుతో అమ్మకాలు జరుపుకోవచ్చన్నారు. దళారుల బారిన పడకుండా మంచి ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం పంటల సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఓబులరెడ్డి, వ్యవసాయ సహాయకురాలు జ్యోతి, ప్రకృతి వ్యవసాయకుడు ఉమా శంకర్, రైతులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలోని శనగలగూడూరు, గాండ్లపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తాడిపత్రి ఏడీఏ చెంగళరాయుడు పప్పుశనగ పొలాల్లోకి వెళ్లి రైతులకు పలు సూచనలు చేశారు. పప్పుశనగకు పచ్చపురుగు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు మొదటి దశలోనే వేపనూనె పిచికారీ చేయాలన్నారు. పప్పుశనగ బీమా చేసుకోవడానికి డిసెంబర్ 15 వరకు గడువు ఉందని ఎకరాకు రూ.450 చొప్పున ప్రీమియం చెల్లించాలని సూచించారు. ఏఓ కాత్యాయని, ఏఈఓ హరి, వీహెచ్ఏ రామలక్ష్మి, వీఏఏ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## సజావుగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

గార్లదిన్నె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వెంకటనారాయణ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. ముందుగా అధికారులు తమ శాఖల ద్వారా ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్ల పలువురు ఎంపీటీసీలు సభ దృష్టికి తెచ్చారు. విద్యార్థులకు అపార్ ఐడీ జనరేట్‌లో ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామ సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్‌కు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. ఇదిలా ఉండగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు ట్లాడుతూ యర్రగుంట్ల వద్ద బైపాస్ కాలువ పనులు చేపట్టాలని, కల్లూరులో అనుమతులు లేకుండా అక్రమంగా లేఅవుట్లు వేశారని, అనుమతులు లేకుండా ఎర్రమట్టి అక్రమ లేఅవుట్లకు తరలిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, కోఆప్షన్ మెంబర్ బాబాయునీస్, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, భూసర్వే డిప్యూటీ తహసీల్దార్ దివాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### వృద్ధురాలి బలవన్మరణం

పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోట గ్రామానికి చెందిన రామసుబ్బమ్మ (67) ఆత్మహత్య చేసుకుంది. పక్షవాతంతో బాధపడుతున్న ఆమెకు తోడుగా ఉన్న భర్త గత నెల 30న అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ క్రమంలో ఒంటరి జీవితాన్ని భరించలేని ఆమె బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా, ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


### ద్విచక్ర వాహనం చోరీ



బైక్‌ను అపహరించుకెళ్లేందుకు వచ్చిన యువకుడు

గుత్తి: స్థానిక తాడిపత్రి రోడ్డులో నివాసముంటున్న ఎర్రిస్వామి ఇంటి ఎదుట నిలిపిన ద్విచక్ర వాహనాన్ని మంగళవారం అర్ధరాత్రి ఓ యువకుడు అపహరించుకెళ్లాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమయ్యాయి. బాధితుడు ఎర్రిస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

### సైకత శివలింగానికి పూజలు



పూజలందుకున్న శివలింగం

తాడిపత్రి రూరల్: స్థానిక బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నున్న పెన్నానదిలో సైకత శివలింగానికి పెద్దసంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. పరమేశ్వరునికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భక్తులు ఇసుకతో శివలింగాన్ని ఏర్పాటు చేశారు.

### చీనీ చెట్ల నరికివేత

గార్లదిన్నె: క్రిష్టాపురంలో ఓ మహిళ రైతుకు చెందిన 16 చీనీ చెట్లను పక్కపొలం వారు నరికేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నాగమునెమ్మకు గ్రామంలో తల్లి ఆస్తి 2.10 ఎకరాలు భూమి ఉంది. ఇటీవల భూమి సర్వే చేయగా 30 సెంట్లు భూమి తమ పక్కపొలం వారికి వచ్చింది. దీంతో వారు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా చీనీ చెట్లు నరికేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## పామిడిలో మందుబాబుల హల్‌చల్

పామిడి: పట్టణంలో మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. దీంతో ప్రజా శాంతికి విఘాతం కల్గుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం ఏరులై పారుతోంది. దీంతో యువత మద్యం తాగి రోడ్లపై తూలుతున్నారు. దీంతో మహిళలు రోడ్లపైకి రావాలంటే భయాందోళన చెందుతున్నారు. ప్రధానంగా ఎద్దులపల్లిరోడ్డులోని వెంచర్ గుండా స్థానిక ఎస్‌ఎఫ్ఎస్ స్కూల్‌కు విద్యార్థులు వెళ్తుంటారు. మధ్యాహ్నం వేళ పిల్లలకు భోజన క్యారియర్లు తీసుకుని ఆ దారి వెంట వెళ్లాలంటే మహిళలకు మందుబాబుల బెడద తప్పడం లేదు. విద్యార్థినులను ఆ దారిగుండా స్కూల్ పంపడానికి పిల్లల తల్లిదండ్రులు జంకుతున్నారు. పీ కొండాపురం రోడ్డుకు గల పామిడి కొండ ప్రాంతం, బైపాస్, మదీనా కాలనీ, బీసీ హాస్టల్ ఇతరత్రా ప్రాంతాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. యూత్ మందుతాగి ద్విచక్రవాహనాలు నడుపుతూ తరుచూ ప్రమాదాలకు కారకులు అవుతున్నారు. గతంలో పోలీసులు పై కాలనీల్లో నైట్‌బీట్ చేపట్టేవారు. కాలక్రమేణా బీట్ ఎత్తివేయడంతో ఆయా కాలనీల్లో మహిళలకు ఆకతాయిల బెడద తప్పడం లేదు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి రాత్రివేళ గస్తీ పెంచి ఆకతాయిల బెడదను అరికట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

### గుండెపోటుతో హెచ్‌ఎం మృతి



రామాంజనేయ రెడ్డి(ఫైల్)

గుత్తి: బసినేపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయ రెడ్డి(58) బుధవారం కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో గుండె పోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గత సోమవారం కర్నూలులోని ఓ ఆసుపత్రిలో రామాంజనేయ రెడ్డి మోకాళ్ల నొప్పులకు శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఈ క్రమంలో అదే ఆసుపత్రిలో ఉన్నఫళంగా కుప్పకూలి కింద పడ్డాడు. అయితే అతన్ని పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. రామాంజనేయ రెడ్డి మృతి పట్ల ఏపీటీఎఫ్ నాయకులు దేశాయి నాగరాజు, శ్రీధర్ గౌడ్, శివ శంకర్, సత్యనారాయణ తదితరులు సంతాపం ప్రకటించారు.

### మద్యం బాటిళ్లు స్వాధీనం

యల్లనూరు: తిమ్మంపల్లికి చెందిన నాగరాజు నుంచి 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీరాంప్రసాద్ తెలిపారు. బుధవారం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఉన్న పార్కులో మద్యం అమ్ముతుండగా ఎస్‌ఐ సిబ్బందితో దాడులు చేశారు. నిందితుడి నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పామిడి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. వివరాలు..ఓబుళాపురం గ్రామానికి చెందిన ఎస్ మాహబూబ్ సాబ్(50) గత 2న స్థానిక సరస్వతీ ఉన్నత విద్యామందిరం సమీపాన రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. చికిత్స ఫలించకపోవడంతో బుధవారం అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్యలు జైనూబీ, హసీనా, కుమారులు ఖాజా, బాషా, కుమార్తె బీబీ ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ యుగంధర్ తెలిపారు.

## షట్టర్ లీకేజీ సమస్యకు పరిష్కారం



షట్టర్‌కు అడ్డుగా గోడ నిర్మించిన దృశ్యం

పుట్లూరు: సుబ్బరాయసాగర్ వద్ద షట్టర్ల లీకేజీ సమస్యను అధికారులు పరిష్కరించారు. కొన్నేళ్లుగా మండలంలోని సుబ్బరాయ సాగర్ వద్ద షట్టర్ల లీకేజీ సమస్య కొనసాగుతోంది. సాగర్‌లోకి నీరు వచ్చిన సమయంలో కొద్దిగా నీరు లీకేజీ రూపంలో బయటకు వెళ్లతుండటంతో పదేళ్ల క్రితం మరమ్మతులు చేపట్టారు. అయితే మళ్లీ సమస్య ఏర్పడటంతో సుబ్బరాయసాగర్ నుంచి నీరు బయటకు వెళ్లడానికి ఉన్న రెండు షట్టర్లలో ఒక షట్టర్‌కు అడ్డుగా గోడను నిర్మించడం గమనార్హం. ఈ విషయం తెలుసుకున్న స్థానిక రైతులు అధికారులు తీరును తప్పుబడుతున్నారు. అయితే ప్రస్తుతం సాగర్ నీరు సరఫరా ప్రారంభమైందని ఈ సమయంలో మరమ్మతు చేయడానికి తగినంత సమయం లేకపోవడంతో గోడ నిర్మించామని అధికారులు చెబుతున్నారు. కాగా ఇప్పటివరకు సాగర్‌లోకి నీటి సరఫరా కాకపోవడంపై మండల రైతులు, ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

### నాణ్యమైన ఆహారం వడ్డించండి



అల్పాహారాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ నయీమ్ అహ్మద్

గుంతకల్లుటౌన్: మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో నాణ్యతతో కూడిన అల్పాహారం, భోజనాలు వడ్డించాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ నిర్వాహకులకు సూచించారు. బుధవారం ఉదయం అన్నక్యాంటీన్‌ను పరిశీలించిన ఆయన ప్రజలతో కలిసి అల్పాహారాన్ని ఆరగించారు. అల్పాహారాన్ని మరింత రుచిగా వడ్డించాలని కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి సూచించారు. మెనూ ప్రకారం శుభ్రతతో పాటు రుచికరమైన భోజనాలను ప్రజలకు వడ్డించాలని సూచించారు. అంతకుముందు ఆయన 33వ వార్డులో జరుగుతున్న డ్రైనేజీ పూడికతీత పనులు పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

### అన్నా క్యాంటీన్ వద్ద పాము కలకలం



అన్నా క్యాంటీన్ వద్ద కనిపించిన పాము

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో ఆర్ అండ్‌బీ బంగ్లాలో ఉన్న అన్నా క్యాంటీన్ వద్ద మంగళవారం రాత్రి ఓ పాము కలకలం రేపింది. స్థానికులు పామును గమనించి భయంతో పరుగులు తీశారు. అయితే కొందరు ధైర్యంతో పాము వద్దకు వెళ్లి దాన్ని పట్టుకుని దూరంగా వదిలివేశారు. దీంతో క్యాంటీన్ నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

### దశల వారీగా సమస్యల పరిష్కారం



ఫోన్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ జబ్బార్ మియా

గుత్తి: పట్టణంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా ప్రజలకు తెలియజేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కమిషనర్ డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఫోన్‌లో కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. తాగునీరు, డ్రైనేజీ, సీసీరోడ్లు నిర్మించాలని పలువురు కోరారు. సమస్యలను పరిష్కరిస్తానని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

### నిందితుడి బైండోవర్

తాడిపత్రి రూరల్: స్థానిక తాహసీల్దార్ కార్యాలయంలో బుధవారం చౌకబియ్యం అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని బైండోవర్ చేశామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో ఆంజనేయస్వామి మాన్యంకు చెందిన రాజశేఖర్ అక్రమంగా చౌక బియ్యం తరలిస్తుండేవాడన్నారు. పట్టణంలోని నందలపాడు ఓవర్ బ్రిడ్జి వద్ద చౌక బియ్యం డంపింగ్ చేశాడన్న సమాచారంతో దాడులు జరిపామన్నారు. బియ్యం దొరకపోయినప్పటికీ ముందు జగ్రత్తగా తహసీల్దార్ రజాక్‌వలి వద్ద నిందితుడిని బైండోవర్ చేశామని సీఐ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

పెద్దవడుగూరు : విరుపాపురం గ్రామం సమీపంలో బుధవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన వివరాలు..పెద్దవడుగూరు గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ హరికృష్ణ, దిమ్మగుడి గ్రామానికి చెందిన రామకృష్ణయాదవ్ గుత్తి నుంచి పెద్దవడుగూరుకు బైక్‌పై బయలుదేరారు. విరుపాపురం వద్దకు రాగానే రైతు పొలంలో పనులు ముగించుకుని ట్రాక్టర్‌పై రోడ్డు దాటేందుకు యత్నించాడు. ఈక్రమంలో బైక్‌పై ఉన్నవారు ట్రాక్టర్‌ను ఢీకొడతామనే భయంతో బ్రేకులు వేయగా అదుపుతప్పి కిందపడ్డారు. ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి.